బ్యారేజీపై మరో 5 రోజులు రాకపోకల నిలిపివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బ్యారేజ్ మరమ్మతు పనుల కోసం ఫిబ్రవరి 10 వరకూ రాకపోకలను నిలిపివేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజ్‌పై రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న పనులు ప్రస్తుతం కాంక్రీట్ క్యూరింగ్ పనుల జరుగుతున్నాయని వెల్లడించారు. ఇరిగేషన్ రివర్ కన్సర్వేటివ్ ఇఇ వి.కాశీవిశ్వేశ్వరరావు సూచన మేరకు బ్యారేజ్‌పై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కావున పోలీస్ శాఖ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు, ఈ రహదారి నుంచి ప్రయాణించే స్కూల్ బస్సుల యజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బస్సులు నడపాలని ఆదేశించారు. కీలక దశలో మరమ్మతు పనులు జరుగుతున్నందున ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

గోదారి ఒడిలో బాలోత్సవం

- ప్రారంభించిన జెసి తేజ్‌భరత్
- వేలాది సంఖ్యలో చిన్నారుల హాజరు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం చిన్నారుల కేరింతలతో పులకరించింది. వారి ఆటపాటలతో తరించింది. సృజనాత్మకతకు దాసోహమైంది. పిల్లల ప్రతిభాపాటవాలకు పరవశించింది. ఎస్‌కెవిటి కళాశాల ప్రాంగణంలో ఉత్సాహ భరిత వాతావరణంలో గోదావరి బాలోత్సవం ఘనంగా శనివారం ప్రారంభమైంది.

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

చారిత్రక రాజమహేంద్రవరంలో 2వ పిల్లల పండుగ గోదావరి బాలోత్సవం ఉత్సాహభరిత వాతావరంతో చిన్నారుల కోలాహలం మధ్య ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణలో అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను జెసి తేజ్‌భరత్ ప్రారంభించారు. ప్రారంభ సభ అమరజీవి షేక్ సాబ్జీ వేదికపై బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు వివిఎస్.కృష్ణకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జెసి మాట్లాడారు. దేశంలో యువత, పిల్లలు అధికంగా ఉన్నారన్నారు. పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యాక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. బాలోత్సవంలో పాల్గొంటున్న విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) మాట్లాడుతూ పిల్లలు విద్యతో పాటూ ఆటపాటల్లోనూ రాణించాలన్నారు. పిల్లల స్వేచ్ఛను హరించేలా నేటి విద్యా విధానాలను పాలకులు అనుసరిస్తున్నారని విమర్శించారు. గోదావరి బాలోత్సవంలో విద్యార్థుల తల్లిదండ్రులూ భాగస్వాములు కావాలన్నారు. కొత్తగూడెం చిల్డ్రన్ క్లబ్ అధ్యక్షులు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ 1991లో బాలోత్సవాన్ని కొత్తగూడెం కేంద్రంగా ప్రారంభించా మన్నారు. నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెద్దఎత్తున బాలోత్సవాలు జరుగుతున్నాయ న్నారు. తిరుమల విద్యా సంస్థల అధినేత, గోదావరి బాలోత్సవం అధ్యక్షులు నున్నా తిరుమలరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ పాటవాలను వెలుగులోకి తెచ్చేందుకు మాత్రమే బాలో త్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ నేడు ఆటపాటలతో కూడిన విద్య అవసరమన్నారు. సమాజంపై అవగాహన పెంచుకోవా లన్నారు. సిసిసి ఎమ్‌డి పంతం కొండలరావు మాట్లాడుతూ పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాలు దోహదం చేస్తాయన్నారు. డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న బాలోత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం బుచ్చిరామయ్య, నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబి, రాజమహేంద్రి విద్యా సంస్థల అధినేత టికె.విశ్వేశ్వరరెడ్డి, డి.సత్యనారాయణ, డాక్టర్ చంద్రశేఖర్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు అరుణ కుమారి, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి మాట్లాడారు.

బాలోత్సవం ప్రారంభ సభలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

32 అంశాల్లో పోటీలు

32 అంశాల్లో సుమారు 60 సాంస్కృతిక, విద్య, విజ్ఞాన విభాగాల్లో నిర్వహించారు. సబ్ జూనియర్ జూనియర్, సీనియర్ విభాగాల వారీగా పోటీలు జరిగాయి. మట్టి బొమ్మల తయారీ, కార్టూన్‌లు గీయడం, దినపత్రిక చదవడం, అంతర్జాలంలో అన్వేషణ, పద్యం -భావం క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం కోలాటం, జానపద నృత్యం, సంప్రదాయ నృతం చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం దేశభక్తి గీతాలాపన లఘు నాటిక బృందం, తెలుగులో మాట్లాడటం, కథలు చెప్పటం,జ్ఞాపక శక్తి పరీక్ష తదితర అంశాల్లో పోటీలు జరుగనున్నాయి.

అలరించిన ప్రదర్శనలు

విచిత్ర వేషధారణ, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటిషన్స్‌లో చిన్నారులు ప్రత్యేక ఆసక్తి చూపించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పలువురు అలరించారు. జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోయడ్యాన్స్‌లు అలరించాయి. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు జరిగిన వేదికలన్నీ ప్రేక్షకులతో కిటకిటలాడాయి. చిత్రలేఖనం పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. లఘునాటికలు, జానపద గేయాలు ఉత్సాహపరిచాయి. కోలాటం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, కథల పోటీలు ఎంతో ఆకట్టుకున్నాయి.

ఏర్పాట్లు బాగున్నాయి

చిన్నారులలో ప్రతిభను వెలికితీసేందుకు వేదిక ఏర్పాటు చేయడం అభినంద నీయం. ఆ దిశగా కృషి చేసిన బాలోత్సవం నిర్వహకులకు ధన్యవాదాలు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్ర మాలు నిర్వహించాలి. ప్రతి పోటీలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గోదావరి బాలోత్సవం ఓ పండుగలా ఉంది. ఏర్పాట్లు బాగున్నాయి.

- ఐ.మీను. రాజమహేంద్రవరం,

చాలా సంతోషంగా ఉంది

ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటిషన్‌లో పాల్గొన్నాను. తెలుగు టీచర్ ద్వారా బాలోత్సవం జరుగుతుందని తెలుసుకున్నాను. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో అల్లూరి సీతారామ రాజు వేషధారణ వేశాను. చాలా సంతోషంగా ఉంది. ఇదే మొదటి సారి. ఏర్పాట్లు బాగున్నాయి.

- టి.సాత్విక్, 4వ తరగతి, పీపుల్స్ ట్రీ స్కూల్

చిన్నారుల ప్రదర్శనలు బాగున్నాయి...

చిన్నారుల ప్రదర్శనలు బాగున్నాయి. మా పాప జీవన వ్యాసరచన పోటీలో పాల్గొంది. గతేడాది గోదావరి బాలోత్సవానికీ వచ్చాం. విభాగాల వారీగా వేదికలు ఏర్పాటు చేయడం బాగుంది. చిన్నారులకు విద్యతో పాటు సామాజిక అంశాలు తెలియజేయడం చాలా అవసరం. అకడమిక్‌తో పాటు కల్చరల్ పోటీలను నిర్వహిస్తున్న బాలోత్సవ్ నిర్వహకులకు అభినందనలు.

- కె.శ్రీహరి రాజమహేంద్రవరం

స్నేహితులతో కలిసి పోటీలకు వచ్చాను...

స్నేహితులందరితో కలిసి ఉత్సాహంగా కోలాటం ప్రదర్శన చేశాము. ఈ పోటీలో ఏడుగురు గ్రూపుగా పాల్గొన్నాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ పోటీలకు వచ్చాం. ఆన్‌లైన్ ద్వారా కోలాటం నేర్చుకుని స్నేహితులకు నేర్పించాను. ఇక్కడ ప్రదర్శన ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

- కె.శివజ్యోతి 6వ తరగతి, టౌన్ హై స్కూలు

నేడు తాడిపర్రులో ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విజయవాడకు చెందిన కార్డియాక్ హాస్పిటల్, ప్రముఖ గుండె వైద్య నిపుణులచే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆదివారం తాడిపర్రులో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆది వారం ఉదయం 11 గంటల నుంచి ఈ వైద్య శిబిరం ప్రారంభం అవుతుందని చెప్పారు. శిబిరంలో గుండె దడ, గుండె నొప్పి, ఆయాసం, వగుర్పు, ఛాతిలో నొప్పి, మంట వంటి ఇబ్బందులు పడుతున్న వారికీ ఖరీదైన టూడి, ఏకో, గుండె స్కానింగ్ పరీక్షలు, ఇసిజి పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. పరీక్షలకు వచ్చే పేషెంట్లు తమ ఆధార్ కార్డు, పాత రిపోర్ట్స్ తీసుకుని రావాలని సూచించారు.

ఎన్‌సిసి పరీక్షలకు 629 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్‌సిసి-ఎ సర్టిఫికెట్ కోసం శనివారం నిర్వహించిన పరీక్షలకు 629 మంది హాజరయ్యారు. 18ఎ బెటాలియన్ కాకినాడ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలను నిర్వహించారు. సుబేదార్ భాస్కర్ రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. 474 మంది బాలురు, 150 మంది బాలికలు పరీక్షల్లో పాల్గొన్నారని తెలిపారు. కాకినాడ, రాజవొమ్మంగి, అమలాపురం, గొల్లపాలెం, రాజమహేంద్రవరం, ఉండూరు, పెద్దాపురం, గోకవరం.కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగిందన్నారు.

కార్టూ'నిజం'



ఇప్పట్లో ఇల్లు కట్టి ఇవ్వడం కష్టమయ్యా.. పంటలు సాగు చేస్కో.. వచ్చే డబ్బులతో ఇల్లు నిర్మించుకోమంటున్నారు సారు..!!

15 నాటికి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 15 నాటికి పెండింగ్ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శనివారం ఎన్నికల నిర్వహణ ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది గుర్తింపు డేటా నమోదు, తుది ఓటరు జాబితా అనంతరం ఫారం 6, 7, 8 లయొక్క ప్రస్తుత పురోగతి తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారి, మరియు పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత జిల్లాకి చెందిన వివరాలను ఆయనకు వివరించారు. ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ సమయంలో బిఎల్ఓలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో విధులు నిర్వర్తించే అధికారులకి, సిబ్బందికి శిక్షణ కోసం మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్నికల నిర్వహణ, సాంకేతిక పరమైన పరిజ్ఞానంపై అవగాహన కల్పించినట్లు వివరించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 395 కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికల తేదీకి అనుగుణంగా చేపట్టవలసిన వివిధ బాధ్యతలపై రూట్ మ్యాప్ సిద్ధం చేసి ఆమేరకు ప్రణాళిక రూపొందించుకోవడం జరిగిందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకటించిన జనవరి 22 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఓటరు జాబితాలో ఫారం 6లు 1394 చేర్చినట్లు, ఫారం -7లు 635 తొలగించినట్లు, ఫారం -8లు చెంది మార్పులు, చేర్పులు 864 జరిగినట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఫారంలకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అమలు చేసేలా రిటర్నింగ్ అధికారులకు, ఎలెక్టోరల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇఆర్ఒ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేస్తామని అన్నారు. పోలింగ్ సిబ్బంది డేటా ఎంట్రీ పనులు జరుగుతున్నాయని, ఫిబ్రవరి 15 పూర్తి చేయనున్నట్లు మాధవీలత తెలిపారు. మైక్రో పరిశీలకులను సోమవారం నుంచి గుర్తించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఆయా నియోజక వర్గాల ఆర్ఒలు ఎన్.తేజ్ భరత్, కె.దినేష్‌కుమార్, అశుతోష్ శ్రీవాత్సవ్, ఎ.చైత్రవర్షిణి, ఎం.మాధురి, కెఎల్.శివజ్యోతి, ఎం.మాధురి, ఆర్‌వి.రమణానాయక్ , డిఆర్ఒ జి. నరసింహులు, పర్యాటక శాఖ ఆర్‌డి వి.స్వామీ నాయుడు, ఎస్‌డిసి ఎం.వెంకటసుధాకర్, ట్రైనీ డిప్యూటీ కలక్టర్లు పి.సువర్ణ, ఎం.భానుప్రకాష్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు ఎస్.ఎం.ఆలీసాహెబ్

డిఎ బకాయిలను విడుదల చేయాలి

ప్రజాశక్తి - నల్లజర్ల

డిఎ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం యూనియన్ నెలవారీ సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం.ఆలీ సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఐడివి.అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏసురత్నం మాట్లాడుతూ 12 పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షన్‌దారులకు జీవన్ ప్రమాణ పత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రతాప్, కోశాధికారి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో వైసిపికి చెందిన పలువురు నాయకులను ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు శనివారం పరామర్శించారు. చాగల్లు గ్రామంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తాళ్లూరి దామోదర రావును ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఇంటి రామారావు మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, రామారావు చిత్రపటం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గండ్రోతు సురేంద్రకుమార్, గారపాటి శ్రీనివాస్, గెడ శ్యామ్, ముల్లపూడి ఉదయ భాస్కర్, సింహాద్రి మాస్టర్ పాల్గొన్నారు.

వైసిపి నాయకుడిని పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ వెంకట్రావు

పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం: మంత్రి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పరిసరాలను పరిశుభ్రతగా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. శనివారం ఆయన ధవలేశ్వరం, ఐఒసిఎల్ కాలనీల్లో పర్యటించారు. పలు డ్రయినేజీ, పార్కుల పరిశుభ్రత, విద్యుత్ దీపాలు వంటి పలు సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పట్టణ, గ్రామాల్లోని ప్రతి వార్డులో డ్రయినేజీ మురుగునీరు పారుదల, మెరుగైన శానిటేషన్, సెప్టిక్ ట్యాంక్ మరమ్మతులు, స్ట్రీట్ లైట్స్ నిర్వహణ వంటి పలు అంశాలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసు కున్నారు. రూరల్ నియోజకవర్గ ప్రజలు ఏ కష్టం వచ్చినా సంకోసం లేకుండా తన దృష్టికి తీసుకు రావచ్చునని తెలిపారు. ఐఒసిఎల్ కాలనీలో సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పీచ్ ట్రైనింగ్ మరియు చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాల సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఇ పాండు రంగారావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

దళిత సింహ గర్జనకు తరలిరావాలి : హర్షకుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహిస్తున్న దళిత సింహ గర్జనకు వేలాదిగా తరలిరావాలని మాజీ ఎంపి జివి.హర్షకుమార్ పిలుపునిచ్చారు. శనివారం కడియం మండలం వేమగిరిలోని సభా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. దళితుల ఆవేదనను, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకే దళిత సింహ గర్జన సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దళితులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను, అణిచివేతను ఎవరో ఒకరు గొంతు విప్పి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అమలాపురం పార్లమెంట్ నియోజక వర్గం నుంచి తనకు 2 దఫాలు ఎంపీగా గెలిపించిన దళితులకు ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దళితులు పడుతున్న కష్టాలు, ఇబ్బందులను కడతేర్చడానికే తన ఉద్యమం సాగుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులకు కేటాయించవలసిన మెడికల్ సీట్లను సైతం అమ్ముకున్నారని అన్నారు. దళితుల అభివృద్ధి కోసం ఖర్చు చేయవలసిన నిధులను, 27 సంక్షేమ పథకాలను తుంగలోకి తొక్కి, ఇతర పథకాలకు మళ్లించారని విమర్శించారు. ఈ ప్రభుత్వ హయాంలో ముఖ్యంగా దళితులు చాలా ఇబ్బందులకు గురయ్యారని, పెత్తందారీ వ్యవస్థ అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వర్గానికి ఒక మంత్రి పదవి కేటాయించినప్పటికీ కూడా సంక్షేమ ఫలాలు అందడం లేదని, దళితులకు గౌరవం దగ్గర లేదని అన్నారు. దళితుల పడుతున్న కష్టాలు, ఇబ్బందులు ఈ దళిత సింహ గర్జన సభ ద్వారా ప్రపంచానికి చాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం సురేష్, శెట్టి రాజు, సైరా భాను, ఎల్‌వి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య కోసం ప్రభుత్వం కృషి

విద్యార్థినికి ట్యాబ్‌ను పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస నాయుడు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పేద విద్యార్థులకు మెరగైన విద్యను అందించడమే కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్‌నాయుడు అనానరు. మండలంలోని చివటం, వేలివెన్ను జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో శనివారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ విధానంలో విద్యార్థులకు నాణ్యమైన చదువును అందించడం కోసమే 8వ తరగతి విద్యార్థులకు ప్రతీ ఏటా ట్యాబ్‌లను అందిస్తుందన్నారు. అలాగే పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, గోరుముద్ద, పాఠశాలలో నాడు నేడు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జడ్‌పిటిసి నందిగం భాస్కరరామయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, పాలాటి శరత్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచకాలపైనే లోకేష్ శంఖారావం

ప్రజాశక్తి - సీతానగరం

గత ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి చేసిన అరాచకాలపైనే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం పూరించారని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్ పర్యటించని నియోజకవర్గాల్లో ఆయన పర్యటన ఉంటుందని చెప్పారు. ఐదేళ్ల పాలన జగన్ రెడ్డి పాలనలో చేసిన దుర్మార్గాలను, దౌర్జన్యాలను ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. ప్రజలు పడుతున్న కష్టాలను శంఖారావం ద్వారా తెలుసుకుంటారని చెప్పారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కటికిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసాద్

జనసేన పార్టీ నాయకులు కటికిరెడ్డి దత్తాత్రేయ ప్రసాద్, నారాయణ కుటుంబాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రసాద్ పరామర్శిం చారు. మండలంలోని చివటం గ్రామానికి చెందిన కటికిరెడ్డి దత్తాత్రేయ ప్రసాద్, నారాయణ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు ఇటీవల కాలంలో వారి తల్లి కటికిరెడ్డి వరలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని అందుకున్న ఆయన ఆమె కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఈ పర్యటనలో జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సీజ్ చేసిన బియ్యంతో అధికారులు

6,100 కేజీల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 6100 కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో రాజానగరం జాతీయ రహదారిలో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని నిలుపుదల చేసి తనిఖీలు చేపట్టగా 122 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6100 కేజీలు బియ్యాన్ని గుర్తించారు. బియ్యం విలువ రూ.2,77,550 ఉంటుం దని అధికారులు వెల్లడించారు. ఈ బియ్యాన్ని కల్లూరు చుట్టుపక్కల గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి కెజి రూ.23లకు కొనుగోలు చేసి బి-ప్రత్తిపాడు సమీపంలో ఉన్న గ్రామాలకు ఇటుక బట్టి కార్మికులు, చేపల చెరువులకు రూ.26లకు విక్రయిం చేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. బియ్యంతోపాటు, బియ్యాన్ని రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. 6-ఎ కేసు, డ్రైవర్ సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిఘా పెట్టినట్లు తెలిపారు ఎవరైనా పిడిఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగవెంకటరాజు, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయ్ భాస్కర్, రాజానగరం సిఎస్‌డిటి ఎం.కమల్‌సుందర్, కానిస్టేబుల్స్ లోవరాజు, కిషోర్ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చాగల్లు గ్రామ పంచాయతీ శివారు జగనన్న కాలనీ పరిధిలో శనివారం ఒక వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. మృతిరాలి తండ్రి కొనకల గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..చాగల్లు గ్రామానికి చెందిన జాన దుర్గ (25)కు మీనానగరంలోని మేనమామ శివరామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు జన్మించారు. అయితే ఇటీవల కాలంలో భార్య, భర్త మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో గత ఆరు నెలలుగా భర్తను వీడి ఆమె తల్లీదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలోనే గత 3 రోజులుగా ఆమె కన్పించక పోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో బంధువులను కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఈ తరుణంలోనే శనివారం ఆమె ఉంటున్న జగనన్న కాలనీ సమీపంలోని జీడిమామిడి తోటలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. ఈ మేరకు మృతిరాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చిక్కాల గ్రామ శివారులో పామాయిల్ తోటలో శుక్రవారం రాత్రి కొంతమంది వ్యక్తులు కోడిపందాలు ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.7,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఖఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డి మందు తాగిన వ్యాపారి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

అప్పుల బాధ తాళలేక గడ్డి మంతు తాగిన సామర్లకోట సంపెంగ తోట ప్రాంతానికి చెందిన కిరాణా వ్యాపారి చోణట్ల మణికంఠ (30) ఆసుపత్రిలో పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం.. కిరాణా వ్యాపారం చేసుకుంటున్న మణికంఠ వ్యాపారపరంగా అప్పుల బాధకు లోనయ్యాడు. దానితో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబీకులు అతడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 15న జరిగే ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు డిఇఒ కె.వాసుదేవరావు తెలిపారు. స్థానిక లలితానగర్‌లోని సిజిటిఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరుగుతున్న ఏర్పాట్లును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులు 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేలా ఎర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎంపికైన ప్రదర్శనలకు రిజిస్ట్రేషన్ సమాచారాన్ని వెంటనే తెలియచేయాలని ఎంఇఒలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జివిఎన్ఎస్.నెహ్రూ, రూరల్ ఎంఇఒ ఎ.దుర్గాతులసీదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ.లిడియాగ్రేస్, కమిటీ సభ్యులు కోలా సత్యనారాయణ, రమణారావు, గణపతి రావు, హరికృష్ణ, మల్లి పూడి రాజు, పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సాహం....

ఎస్‌కెవిటి కళాశాల ఆవరణలో ప్రారంభమైన గోదావరి బాలోత్సవం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా విభాగాల్లో పోటీలకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు.

షేక్ సాజ్జి, దామెర్ల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న తిరుమలరావు తదితరులు

హాజరైన చిన్నారులు

విద్యార్థుల సైనిక విన్యాసం

గిరిజనుల వేషధారణలతో విద్యార్థినులు

విద్యార్థినుల లంబాడీ నృత్యం

జానపద నృత్య ప్రదర్శన

ఎన్నికల వేళా నిరాశే...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా వాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఓటాన్ బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యత ఉంటుందని అందరూ భావించారు. కాని ఎలాంటి నిధులు విదల్చకపోవడంతో జిల్లా ప్రజలు ఊసూరుమన్నారు. ఫలితంగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టేశాయి. అధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కీలకమైన కాలువల ఆధునికీకరణకు సైతం నిదులు విదల్చలేదు. ఈ పనులను వైసిపి అధికారలోకొచ్చిన తర్వాత పూర్తిగా అటకెక్కించింది. కేవలం తూటుకాడ తొలగింపునకు మాత్రమే పరిమితమైంది. కాటన్ బ్యారేజీ మరమ్మతుల కోసం గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సైతం ఖర్చు చేయలేదు. కోనసీమ వాసుల చిరకాల కల అయినా కోటిపల్లి నర్సాపురం రైల్వేలైను మాటను పూర్తిగా మరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాలో కొంత మేరైనా నిధులు విడుదలవుతాయని చూశారు. కాని అలాంటి కూతలు లేకుండానే రెడ్ సిగ్నల్ వేశారు. గోదావరి నదీ కాలుష్య నివారణ అంటూ కేటాయించిన నిధులు కాగితాలు దాటి ఆచరణ రూపం దాల్చలేదు. కీలకమైన ప్రాజెక్టుల అమలు కోసం కేంద్రంలోని బిజెపి నిధుల రావాల్సి ఉంది. అయితే ఆ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోవడంతో నిధులు విడుదల చేయట్లేదు. తాజాగా విడుదల చేసిన బడ్జెట్‌లోనూ కేంద్రం నుంచి నిధులు వస్తాయని చెప్పటం విమర్శలకు దారితీస్తోంది. అధికార వైసిపితో పాటు ప్రతిపక్ష తేదేపా, జనసేన పార్టీలు పోటీపడి మద్దతు తెలపటమే ఈ దుస్థితికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆశాలపై నిర్బంధం

కనీస వేతనం కోసం ఆశాలు చేపట్టిన చలో విజయవాడను భగ్నం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన అక్రమ అరెస్టులు, నిర్బంధాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఒకరోజు ముందు నుంచే పోలీసులను ఆశాలపై ప్రయోగించింది. అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా పోలీసులు ఆశాలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. టిక్కెట్ కొనుక్కొని బస్సుల్లో వెళ్తున్న వారిని సైతం అడ్డగించి కిందకు దింపేశారు. ఈ నిర్బంధాలను వామపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. టిడిపి,జనసేన నాయకులు సైతం పలుచోట్ల నిర్బంధాలను వ్యతిరేకించారు. నిర్బంధాలకు నిరసనగా చేపట్టిన ధర్నాలు విజయవంతమయ్యాయి.

మరో పక్క జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రంగా రాజకీయ పార్టీలు అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పోటీ పడుతున్నాయి. అధికార వైసిపి ఇప్పటికే అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేసింది. టిడిపి, జనసేన కూటమి తెలుగుదేశం-జనసేన కూటమి త్వరలోనే తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు సమాయత్తం అవుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సైతం తన ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పిసిసి ఛీఫ్ వైఎస్.షర్మిల జిల్లాలో పర్యటించింది. చాగల్లులో రచ్చబండ, తునిలో రోడ్‌షోలతో ఒకరోజు పర్యటనను విజయవంతం చేసుకున్నారు. అధికారవైసిపితో పాటూ టిడిపి, జనసేన కూటమిలపైనా ఆమె పలు విమర్శలు చేశారు. కేంద్రంలో బిజెపితో అంటకాగుతున్న పార్టీలను సాగనంపాలని పిలుపునిచ్చారు. వైసిపి, టిడిపిలకు ఓటేస్తే బిజెపికి ఓటు వేసినట్టేనని జిల్లా ప్రజలను హెచ్చరించారు. ప్రత్యేక హోదా, నిధుల్లో రాష్ట్ర వాటాలను ప్రస్తావించారు. అవన్నీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే రాహులు చేస్తారని చెప్పారు. జిల్లాలో కనుమరుగైన కాంగ్రెస్ పార్టీకి షర్మిల టూర్ ఉత్సాహాన్ని నింపింది. మరోపక్క కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు పలువురు దరఖాస్తులను సైతం చేసుకుంటున్నారు. మెత్తంగా షర్మిల రాకతో జిల్లాలో హస్త వాసి ఎలా మారుతుందో వేచిచూడాలి.

నేడు నైనాలకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రముఖ సామాజికవేత్త, పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు నైనాల కృష్ణారావుకు ఆదివారం ఆత్మీయ సత్కారం, అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ గుబ్బల రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. నయనాలకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా జరుగుతన్న ఈ సత్కార సభ స్థానిక శ్రీనగర్ కాలనీలోని ఎపిఎస్ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని వెల్లడించారు. గత నాలుగు దశాబ్దాలుగా పూలే సామాజిక చైతన్య వేదికను స్థాపించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల ఐక్యతతోపాటు పూలు అంబేద్కర్ భావజాల వ్యాప్తికి కృష్ణారావు చేసిన విశేష కృషికి డాక్టరేట్ వచ్చిందన్నారు. ఆత్మీయ సత్కార సభకు పూర్వపు గోదావరి జిల్లాల నుంచి పలువురు మంత్రులు, ఎంపీ లు, ఎంఎల్ఎలతోపాటు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఎపిఇపిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : వినియోగదారులకు సేవలందించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా (ఇప్పయ్) ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గాంలో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ మేరకు ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తరపున సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం ఈ అవార్డులను అందుకున్నారు. ఇంధన రంగంలో విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించబడిన సరికొత్త కృత్రిమ మేధ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ వంటి అంశాలపై చర్చించేందుకు బెల్గాంలోని శూన్య ఫార్మ్ రిట్రీట్‌లో ఇప్పయ్ ఆధ్వర్యంలో '24వ రెగ్యులేటరీ అండ్ పాలసీమేకర్స్ రిట్రీట్' పేరిట ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సదస్సు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జరిగిన ఇప్పయ్ పవర్ అవార్డ్స్-2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో ఇంధన రంగంలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ఎపిఇపిడిసిఎల్ జాతీయ స్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు వినియోగదారుల్లో అవగాహన పెంపుదల అంశంలోనూ అవార్డును సొంతం చేసుకుంది. రెండు జాతీయ అవార్డులు లభించడం పట్ల సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఇపిడిసిఎల్‌లో పలు రకాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగులు, సిబ్బంది అత్యుత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డులను సొంతం చేసుకుందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు మరిన్ని నాణ్యమైన సేవలందిస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ, సంస్థను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు కృషి చేస్తామని తెలియచేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి - గోకవరం

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిని గెలిపించాలని టిడిపి నాయకులు కోరారు. మండలంలోని వెదురుపాకలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం శనివారం యూనిట్ ఇన్‌ఛార్జ్ పిల్ల చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఆడబిడ్డ నిధి పేరుతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 59 సంవత్సరాలు వచ్చే వరకు ప్రతినెల రూ.1500 అందిస్తామని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ఒక ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకున్న వారందరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున, రైతు భరోసాగా ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగులకు ప్రతినెల రూ.3 వేలు అందిస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి ఛాంపియన్ ఎస్. బాబు, గొంతిన రామకృష్ణ, బలిజ నరసింహారావు, వీరోది వెంకటేశ్వరావు, గాలి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో కరపత్రాలను అందిస్తున్న టిడిపి నాయకులు

18న ఆర్ఎ పోస్టుల భర్తీకి రాతపరీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 18న తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో రెండు రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుల కోసం 2019 జూలై 16న నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, అయితే అప్పట్లో కోవిడ్ కారణంగా రాత పరీక్షను వాయిదా వేసినట్లు తెలిపారు. ఆ పరీక్షను ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళల డిగ్రీ, పిజి. కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కోసం షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా హాల్ టికెట్లను పంపించామని, దరఖాస్తులో తెలిపిన చిరునామాల్లో అభ్యర్థులు లేకపోవడం, ఇతర కారణాల వల్ల హాల్ టికెట్లు తిరిగి సంస్థకు వచ్చినట్లు తెలిపారు. అలాంటి అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి వారి హాల్ టికెట్లను రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంను సంప్రదించాలని సూచించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోపాలపురం

ఇటీవల అనారోగ్యంతో మరణించిన కోలా శ్రీనివాసరావు కుటుంబానికి రూ.10వేల సాయం అందించామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు తెలిపారు. కోలా శ్రీనివాసరావు జనసేన పార్టీలో క్రియాశీల సభ్యునిగా ఉన్నారన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. పార్టీ తరపున ఆర్థిక సాయం అందించారు శ్రీనివాసరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు పోసిన గణపతి, గ్రామ అధ్యక్షులు వడ్డి రామలీల, శాంతి, నరేంద్ర, సీతారాం, మణికంఠ, మల్లేశ్వరరావు, సబ్బిత శ్రీను, ఉదయ్ ప్రకాష్, సీతామహాలక్ష్మి, వెంకటలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డేటా నమోదు పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లా కలెక్టరేట్‌లో పిపిఎంఎస్ డేటా నమోదు కేంద్రాన్ని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర డేటా పర్సనల్ మేనేజ్‌మేంట్ సిస్టమ్ పోర్టల్లో నమోదు చేయడం జరుగుతోందన్నారు. పాఠశాలల ఉపాధ్యాయుల డేటా నమోదు ప్రక్రియ కొనసాగుతున్నట్టు నోడల్ ఆఫీసర్ బి.దిలీప్‌కుమార్ ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివైఇ ఇవిబిఎస్.నారాయణ, ఎఎస్ఒ ప్రసాద్, ఎంఇఒలు తిరుమల దాస్, కెఎన్‌వి.గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు గ్లోబల్ సిటిజన్‌లుగా ఎదగాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్దతుల్లో మెళకువలు నేర్చుకుని ఆసక్తికరమైన తరగతి గదిని రూపొందించాలని డివైఇఒ ఇవిబిఎస్.నారాయణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలి కోన్నత పాఠశాల లో గత రెండు రోజులుగా జరుగుతున్న స్టెప్.శిక్షణా తరగతులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది హిందూ గ్రూప్ నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత కోసం సాంకేతికతతో కూడిన ఆంగ్ల భాషా మూల్యాంకనంపై ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు భాష పట్ల మక్కువ పెంచుకునేలా బోధనా పద్ధతులు ఉండాలన్నారు. విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్‌లుగా తయారు చేయాలన్నారు. శిక్షణ నిర్వహకురాలు అనిత మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి వర్క్ షాప్ 8, 9 తేదీల్లో ఆఫ్ లైన్ మోడ్‌లోనూ, 10,11 తేదీల్లో ఆన్ లైన్ విధానం లోనూ జరుగుతుందన్నారు.

ఓటు అడిగే హక్కు వైసిపికే ఉంది

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైసిపికే రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఉందని పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ డాక్టర గూడూరి శ్రీనివాస్, కొవ్వూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని తాళ్లపూడి, పోతవరం, గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల్లో పలువురు నాయకులను, కార్యకర్తలను కలుసుకుని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బటన్ నొక్కే ముఖ్యమంత్రి మళ్లీ కావాలంటే తిరిగి జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఎంపిగా, ఎంఎల్ఎలుగా తమను గెలిపించి జగన్‌ను సిఎంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్కా వెంకట అనురాధ, బిసి నాయకులు నక్కా చిట్టిబాబు, మండల వైసిపి అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి, తలారి

టిడిపిలోకి వైసిపి వార్డు మెంబర్

కండుపా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని తిరుమలయపాలెం పంచాయతీ 8వ వార్డ్ మెంబర్, వైసిపి నాయకుడు గరగ వెంకటేశులు టిడిపిలో చేరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జ్యోతుల నెహ్రూ సమక్షంలో శనివారం ఇర్రిపాక గ్రామంలో వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. ఆయనకు జ్యోతుల నెహ్రూ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న వైసిపి ప్రభుత్వ తీరు నచ్చకే ఆ పార్టీకి ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేస్తున్నారని అన్నారు. పంచాయతీ వ్యవస్థను కాపాడుకునేందుకు సర్పంచులు, వార్డు మెంబర్లు పోరాటం సాగిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నాఉ. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పురంశెట్టి శివాజీ, ఉండమట్ల దొరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, బోనం వెంకటేశులు, వాకాడ బుజ్జి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, పుల్లలపాడు గ్రామానికి చెందిన పెనుమర్తి భాను మేఘన, D/o. పెనుమర్తి ఆనందరావు అను నాకు పాస్‌పోర్టు నెంబరు **V2586480** కలదు. నా యొక్క పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం మా ఇంటి దగ్గర నుండి నల్లజర్ల ఆటోలో వెళ్ళుచుండగా పడిపోయినది. దొరికినవారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

పెనుమర్తి భాను మేఘన
D/o. పెనుమర్తి ఆనందరావు
డో.నెం. 1-76/1, హైస్కూల్ రోడ్డు
పుల్లలపాడు, నల్లజర్ల మండలం
తూర్పుగోదావరి జిల్లా - 534112
సెల్: 9398004501

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టు
S.O.P. No. 1 of 2024

Between:
1. అమ్ముల వెంకట పద్మావతి
2. కోటిపల్లి శివనారాయణ
3. కోటిపల్లి వీర వెంకట సుబ్బారావు
4. కోటిపల్లి కృష్ణ చైతన్య
5. కోటిపల్లి కళ్యాణి -పిటిషనర్లు

AND

Nil -రెస్పాండెంట్

పిటిషనర్లు లేటు కోటిపల్లి సోమేశ్వరి గారి కరూర్ వైశ్య బ్యాంకు, పెద్దాపురంలోని లాకర్ తెరచుకొనుటకు అనుమతి కోసం పై నంబర్ పిటిషన్ దాఖలు చేసినారు. పై నంబరు పిటిషన్ నందు ఎవరికైన ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 28-02-2024వ తేదీన వాయిదా అయి వున్నది.** ఆరోజున స్వయంగా గానీ, న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి వారి వాదనను తెలుపుకొనవచ్చును. లేని యెడల శ్రీ కోర్టు వారు పిటిషనరులకు అనుకూలంగా తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

ఎం.కె.మొహియిద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం